క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. విశేషంగా హారతులు ఇచ్చారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



రైలు ప్రమాద మృతులకు నివాలర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి సీఐటీయూ నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రమాదంలో సుమారు 290 మంది మృత్యువాత పడడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రమాదానికి బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైల్వే ప్రైవేటీకరణ యోచన విడనాడి, రైల్వేశాఖలో ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కె.వెంకునాయుడు, పోతినాయుడు, రామునాయుడు, అప్పారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు



మాట్లాడుతున్న కర్రి అప్పలస్వామి తదితరులు

సింహాచలం: విద్యార్థుల్లో మేధాశక్తి పెంపుదలకు క్విజ్ పోటీలు దోహదపడతాయని అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, రిసోర్స్ పర్సన్లు బి.బి.రాజేంద్రప్రసాద్, సీహెచ్. సూర్యనారాయణరాజు, ఏఈఎస్ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ

సీతంపేట: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం లలితానగర్ లలితా పీఠంలో కర్ణాటక గాత్ర కచేరీ నిర్వహించారు. ద్వారం త్యాగరాజు శిష్యురాలు అక్కినాపల్లి లక్ష్మీశైలజ అన్నమయ్య, త్యాగరాజ, ముత్తుస్వామి కీర్తనలు ఆలపించి ఆహూతులను అలరించారు. ఈమెకు సరస్వతుల పార్థివ వయోలిన్‌పై, డి.సందీప్ మృదంగంపై వాద్య సహకారం అందించారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ఆయా వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

పేదల మేలు కోరే గొప్ప సీఎం జగన్

● ముత్తంశెట్టి ఎదుట అభిమానం చాటుకున్న అప్పారావు



వి.అప్పారావు



మహిళకు ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: ఈ చిత్రంలోని వ్యక్తి టీవీ టవర్ కాలనీకి చెందిన అప్పారావు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు తనకు భరోసా కల్పించాయని సంతోషం వ్యక్తం చేశారు. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అడవివరంలోని 527 సచివాయం పరిధిలోని టీవీ టవర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు పథకాల లబ్ధిదారు అప్పారావు మాట్లాడుతూ పేదల శ్రేయస్సు కోరే గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో కూడా సీఎం జగన్ నియమించిన వలంటీర్ ప్రతీ నెలా ఉదయం 6 గంటల్లోపు రూ.2500 పింఛన్ ఇచ్చాడు. మందులు కొనుక్కునేందుకు పింఛన్ నగదు ఎంతో ఉపయోగపడేవి. గుండెనొప్పితో కేర్ ఆస్పత్రిలో చేరితే డాక్టర్లు స్టంట్ వేయాలని చెప్పారు. పేదరికంలో ఉన్న మాకు కష్టమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఆరోగ్య శ్రీ ద్వారా మొత్తం వైద్య ఖర్చులు ఇచ్చింది. డిశ్చార్జ్ తర్వాత ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఖాతాలో వేశారు. ప్రస్తుతం పింఛన్ రూ.2750 ఇస్తున్నారు. జగనన్న పాలన ఎంతో సంతోషంగా ఉంది. నాకేంతో మేలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. అనంతరం ముత్తంశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు గతంలో ఎవరూ అందించని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. ప్రతీ పేదవాడి కళ్లలో ఆనందం చూడాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమాన్ని అందిస్తున్నామన్నారు.

సమస్యలకు పరిష్కారం సూచిస్తూ..

అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పందుల సమస్య ఉందని తెలియజేయడంతో జెడ్సీని పిలిచి గురువారం స్పెషల్ డ్రైవ్ పెట్టాలని ఆదేశించారు. పెంపకం దార్ల నుంచి అడ్డంకులు రాకుండా బందోబస్తు నిర్వహించాలని గోపాలపట్నం సీఐ నరసింహరావుకు సూచించారు. అలాగే రోడ్లు లేవని, లైట్లు సరిగ్గా వెలగడం లేదని నిర్వాసితులు వివరించారు. నెల రోజుల్లో రోడ్డు ఏర్పాటు చేయాలని జెడ్సీని ఆదేశించారు. లైట్లు ఏర్పాటు చేయాలని ఏఈకి సూచించారు. రోజూ చెత్త తరలించాలని, ప్రతీవారం స్పెషల్ డ్రైవ్ పెట్టాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. దేవస్థానం భూసమస్య పరిష్కారానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ 8వ జోన్ జెడ్సీ మల్లయ్యనాయుడు, 98వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, నాయకులు కర్రి అప్పలస్వామి, లంక సత్తిబాబు, ఆదిరెడ్డి, ఎస్.అప్పారావు, దొంతల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికా సాధికారతకు పెద్దపీట

కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి



వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి



సాధికారిత బాలికలతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

పరవాడ: బాలికా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించి వ్యక్తిత్వ వికాశాన్ని పోత్సహించడానికి సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేస్తున్న కృషి అమోఘమని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అభినందించారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో నిర్వహిస్తున్న బాలిక సాధికారత మిషన్ వర్క్‌షాప్-2023ను కలెక్టరు బుధవారం సందర్శించారు. బాలికలతో మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. భవిష్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి బాటలు వేసుకోవడంతో పాటు జీవితంలో విజయాలే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి బాలికలకు సూచించారు. కార్యక్రమంలో సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, చీఫ్ జనరల్ మేనేజర్ గోవిందరాజన్, హెచ్‌ఆర్ హెడ్ రుమాడీశర్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే విజయం



దీక్షలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఓబులేసు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దుర్మార్గమని ఏపీ స్టేట్ ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ ఓబులేసు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 846వ రోజు బుధవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నాలను కార్మిక వర్గం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉక్కు పరిశ్రమను చేజార్చుకోకూడదని అన్నారు. దీక్షలో సంస్థకు చెందిన బ్లాస్ట్‌ఫార్నేస్ విభాగ కార్మికులు కూర్చున్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'షరతులు లేని వేతన ఒప్పందం చేయాలి'

దాబాగార్డెన్స్: ఎటువంటి షరతులు లేని వేతన ఒప్పందం వెంటనే చేయాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్, డాక్‌వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పోర్టు ప్రధాన గేట్ సీహార్స్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ ద్వైపాక్షిక వేతన సంప్రదింపుల కమిటీలో యాజమాన్యం నుంచి 13 మంది, ట్రేడ్ యూనియన్ నుంచి 13 మంది ఉన్నారన్నారు. మేజర్ పోర్టులో పని చేస్తున్న కార్మికులకు ధరల పెరుగుదలకు అనుగుణంగా ఎంత జీతం ఉండాలో ఈ కమిటీ నిర్ణయం చేస్తుందని, అటువంటి కమిటీని కాదని వీపీఏ యాజమాన్యం ఐదుగురు సభ్యులతో సబ్ కమిటీ వేయడాన్ని తప్పుపట్టారు. పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌కి ఇవ్వడాన్ని విరమించుకోవాలని, పోర్టు స్థలాలు, స్టేడియం, కల్యాణ మండపాలు ప్రైవేట్‌కు ఇవ్వరాదని, సీహెచ్‌డీ క్యాజువల్, పూల్, పోర్టు కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లిమిటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యానారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామలింగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ త్రినాథరావు, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సత్యనారాయణ, నర్సింగ్, గణేష్, రాము పాల్గొన్నారు.

సాగర సంరక్షణ సమష్టి బాధ్యత

● నేడు ప్రపంచ సముద్ర దినోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య రామకృష్ణారావు తదితరులు

ఏయూక్యాంపస్: మానవాళి మనుగడకు అవసరమైన ప్రాణవాయువును అధికంగా అందించే సముద్రాలను కాపాడుకుందాం అని కృష్ణ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమావేశ మందిరంలో బుధవారం ఉదయం నిర్వహించిన ప్రపంచ సముద్రాల పరిరక్షణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 2050 నాటికి చేపలు, ఇతర జీవరాశి కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే సముద్రాలలో అధికంగా ఉంటాయని ఒక సర్వేలో తేలిందన్నారు. ఇటువంటి సమయంలో సముద్రాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందన్నారు. ఏయూ సైన్స్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ డీఈ బాబు మాట్లాడుతూ సముద్రాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. 50 శాతానికి పైగా ప్రాణవాయువును ఇచ్చే సముద్రాల పరిరక్షణ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు ఎస్. బాలప్రసాద్ మాట్లాడుతూ సముద్రాల పరిరక్షణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఏయూ పర్యావరణ శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఈయూబీ రెడ్డి మాట్లాడుతూ సముద్రాలలోకి విష రసాయనాలు, విషపూరితమైన క్రిమిసంహారాలు, భార లోహాలు వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరనాథ్, జీవ వైవిధ్య మండలి రీజనల్ కోఆర్డినేటర్ జానకిరావు, సిఫా సంస్థ ప్రతినిధి డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

నేడు రోడ్డు పనులకు శంకుస్థాపన

సింహాచలం: అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు రూ.12కోట్లతో చేపట్టనున్న రోడ్డు ఆధునీకీకరణ పనులకు గురువారం శంకుస్థాపన జరగనుందని వైఎస్సార్‌సీపీ పెందుర్తి మండల అధ్యక్షుడు నక్క కనకరాజు తెలిపారు. పెందుర్తిలోని తాండ్రపాపారాయుడు కల్యాణ మండపం ఎదురుగా నిర్వహించనున్న కార్యక్రమంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొంటారని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ఒత్తిడి దూరం



ప్రసంగిస్తున్న రాజయోగిని మాధురి

గాజువాక : విద్యార్థుల్లో సృజనాత్మకతను మేల్కొలిపే విధంగా ఉపాధ్యాయులు బోధన సాగించాలని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజయోగిని మాధురి సూచించారు. స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో ఆమె ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే చిన్నారులకు ఆధ్యాత్మిక చింతనను అలవాటు చేయాలని, దీని వల్ల ఒత్తిళ్లను తట్టుకొని ప్రశాంతంగా ఉంటారని అన్నారు. ప్రశాంతంగా ఉన్నవారు తమ లక్ష్యాలను అధిరోహించగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ ప్రమీలా ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానంపై సైకిల్ ర్యాలీ

తాటిచెట్లపాలెం: కేంద్రీయ విద్యాలయం(వాల్తేర్) ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 15 వరకు నూతన జాతీయ విద్యా విధానం-2020పై అవగాహన కల్పించేందుకు విద్యార్థులు ప్రత్యేక సైకిల్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కేవీ ప్రిన్సిపాల్ కమల్ జీత్ నేతృత్వంలో విద్యార్థుల బృందం ఫిజికల్ అండ్ హెల్త్ టీచర్ కె.ఎం.రియాజ్‌ఖాన్, కోచ్‌లు వి.శివగిరి, బి.రాణిలతో కలసి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. జీ-20 కోసం నిర్వహించిన జనభాగిదరిలో భాగంగా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ చేసినట్లు స్కూల్ సిబ్బంది తెలిపారు. సమీప భవిష్యత్తులో దేశంలోని విద్యార్థులను ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి ప్రజలు, తల్లిదండ్రులు తమ వంతు సహకారాన్ని అందిస్తూ, భాగస్వాములు కావాలని ఈ సైకిల్ ర్యాలీ ద్వారా తెలియజేస్తున్నారు.

బయో ఇన్నోవేషన్ ఇగ్నిషన్ ప్రోగ్రాంకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఆచార్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆ హబ్, మేథో సంపత్తి విభాగం, ది సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ అప్లయిడ్ బయొలాజికల్ సైన్సెస్-ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(టీ క్యాబ్స్-ఇ) సంయుక్తంగా నిర్వహిస్తున్న బయో ఇన్నోవేషన్ ప్రోగ్రాం-2023కు విద్యార్థుల ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. వర్సిటీలోని పలు విభాగాలకు చెందిన విద్యార్థులను మౌఖిక పరీక్షల ద్వారా ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. వర్సిటీ విద్యార్థులు అలేఖ్యా అధికారి, నిఖిల్ చెన్ను, మహాలక్ష్మి వోలేటి, మోనాలిసా చౌదరి, మునీషా కుసుమే, పూర్ణిమ మల్లూరి, ప్రత్యూష సారవు, సునీత గంట ఎంపికయ్యారు. టి క్యాబ్స్ - ఇ వ్యవస్థాపకుడు డాక్టర్ రవికిరణ్ యేడిది, ఐపీఆర్ చైర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను అధికారులు అభినందించారు.

సీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



గుల్లేపల్లిలో శంకుస్థాపనలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అదీప్ రాజ్

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లిలో సీతారాముల ఆలయ పునర్నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. సుమారు కోటి రూపాయిలతో కొత్త ఆలయ నిర్మాణం తలపెట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ బోకం సూర్య కుమారి రామానాయుడు దంపతులు, సర్పంచ్ బండారు మంగ,శ్రీనివాస్ దంపతులు ఇతర గ్రామ పెద్దలు హోమ గుండాల వద్ద పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ఉంటేనే మానవులు హింసాయుత వాతావరణానికి దూరంగా ఉంటారన్నారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ సూర్యకుమారి మాట్లాడుతూ 40 ఏళ్ల కిందట నిర్మించిన ఆలయం జీర్ణావస్థకు చేరడంతో పెద్దల నిర్ణయం మేరకు నూతన ఆలయ నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. సుమారు రూ.కోటితో ఇక్కడ ఆలయ పునర్నిర్మాణానికి సంకల్పించామని, భక్తులు గ్రామస్తులు సహకారంతో త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరాధ్యుల సీతారామాంజనేయ శాస్త్రి సమక్షంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వేద పండితులు దుర్వాసుల రామశాస్త్రి, దుర్వాసుల ప్రదీప్ చంద్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో గుల్లేపల్లి సర్పంచ్ బండారు మంగ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరామ్, నాయకులు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, బ్యాంక్ మహేష్, యడ్ల నాయుడు, వనం అచ్చంనాయుడు, బోదువలస సర్పంచ్ బైలపూడి రామారావు, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయం



గుంతలతో నిండిన ఎన్టీపీసీ కారిడార్ రహదారి

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కారిడార్ రహదారి గుంతల మయంగా మారింది. సింహాద్రి ప్లాంట్ నుంచి లంకెలపాలెం వంతెన వరకు 6 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన కారిడార్ రహదారి శిథిలం కావడంతో వాహన సిబ్బంది, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కలపాక, పి.బోనంగి, దాసరిపేట, గొల్లపేట, దేశపాత్రునిపాలెం గ్రామాలకు చెందిన ప్రయాణికులతో పాటు ఫార్మాసిటీ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. సింహాద్రి యాష్ పాండ్ నుంచి బూడిదతో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు సైతం గుంతల వల్ల తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైకిళ్లపై రాత్రివేళ రాకపోకలు సాగిస్తున్న కార్మికులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. కారిడార్ రహదారి మరమ్మతులు చేపట్టడానికి సింహాద్రి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహన సిబ్బంది కోరుతున్నారు.

సీఐటీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (ఐటీఓటీ) ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ ట్రేడుల్లో 2023-24 సంవత్సరానికి గాను క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ ట్రైనింగ్ స్కీమ్ (సీఐటీఎస్)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వీరికి వచ్చే నెల 8న ఆన్‌లైన్‌లో ఆలిండియా కామన్ ఎంట్రన్స్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కోసం ఐటీఐ అప్రెంటిస్ పాసైన అభ్యర్థులు, డిప్లొమా, డిగ్రీ పాసైన వారు అర్హులని తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్‌లో 25 సీట్లు చొప్పున భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. www.nimionlineadmission.in ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్



రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి చర్యలు చేపట్టామని అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి అన్నారు. 79, 85 వార్డుల కూడలి లంకెలపాలెం జాతీయ రహదారి కూడలి విస్తరణ పనులకు ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో కూడలిలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండటంతో రహదారి విస్తరణ, ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు రూ.43లక్షలు ఆర్థిక సంఘం నిధులు కేటాయించామని తెలిపారు. గతంలో గాజువాక నుంచి ఫార్మాసిటీ కాలనీ వైపు వెళ్లే మార్గంలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడం వల్ల ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తీరిందన్నారు. లంకెలపాలెం ఫ్లైఓవర్ వంతెన సమస్య రైల్వే అధికారుల పరిశీలనలో ఉందన్నారు.

అధికారుల దృష్టికి డ్రైనేజీల నిర్మాణం ..పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ కూడలిలో డ్రైనేజీల నిర్మాణం విషయాన్ని ఎన్‌హెచ్ఏఐ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. లంకెలపాలెం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. రెండు జిల్లాలకు సరిహద్దుగా ఉన్న లంకెలపాలెం కూడలి రానున్న రోజుల్లో కీలకం కానుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, రౌతు శ్రీనివాసరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ , ఎంఎస్ఎంఈ డైరెక్టర్ శీలం నదియా, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, నాయకులు సుందరపు అప్పారావు, పచ్చికోరు రమణమూర్తి, దాసరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

9,10 తేదీల్లో ఆటో రిక్షా కార్మిక సంఘం మహా సభలు



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

అల్లిపురం: ఈ నెల 9,10 తేదీల్లో విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) 4వ మహాసభలు టీఎల్ఎన్ సభా హాల్లో జరగనున్నాయని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె.రెహమాన్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 1998 నుంచి ఆటో రిక్షా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో జరగనున్న మహాసభలు అత్యంత విశిష్టతను సంతరించుకున్నాయన్నారు. ప్రభుత్వాలు ఆటోడ్రైవర్లపై ఆర్థిక భారం మోపుతూ జీవో నంబర్ 21 తీసుకొచ్చాయన్నారు. ఆటో డ్రైవర్లు యాక్సిడెంట్‌కు గురై చనిపోతే రూ.10 లక్షలు, సాధారణ మరణానికి రూ.5 లక్షలు వర్తించే విధంగా ఉచిత ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ అదనపు కార్యదర్శి ఎం.మన్మథరావు, సంఘం అధ్యక్షుడు సీఎం రమణ, ఉపాధ్యక్షుడు సీహెచ్ కాసుబాబు, కార్యదర్శి సింహాద్రి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.